



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
18 జూన్, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## ఆ కేంద్రమంత్రి ఎవరో చెప్పండి!

**సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి సవాల్**

**రాష్ట్ర ప్రాజెక్టులను అడ్డుకుంటున్నానన్న ఆరోపణ బోగస్**

**నిధులు ఇవ్వొద్దని చెప్పాననడం సీఎంస్థాయికి తగదు**

**మెట్రో రెండో దశకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం**

**రేవంత్‌తో కలిసి కేంద్ర మంత్రులను కలవడానికి సిద్ధం**

న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు, రాష్ట్ర అభివృద్ధి పనులను తాను అడ్డుకుంటున్నానంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు ఆపాలని తాను ఏ కేంద్రమంత్రికి చెప్పానో పేరు చెప్పాలని సీఎంకు సవాల్ విసిరారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే ఆలోచన తనకు

(మిగతా 2వ పేజీలో)

# తరగతి గదుల నుంచే బంగారు బాట

**ప్రభుత్వ విద్య ద్వారానే పేదల జీవితాల్లో శాశ్వత మార్పు**

**ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపు**

**ప్రతి నియోజకవర్గంలో టీపీఎస్ ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం**

**ప్రభుత్వ బడుల పునరుద్ధరణతో ప్రతిభకు కొత్త వేదిక**

**యూనిఫాం, పుస్తకాలతో విద్యార్థులకు సమగ్ర విద్యా కిట్లు**

**స్కిల్స్, స్పోర్ట్స్ వర్సిటీలతో యువతకు కొత్త అవకాశాలు**

**డ్రగ్స్ రహిత తెలంగాణకు విద్యార్థుల భాగస్వామ్యం అవసరం**



రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామం బుధవారం తెలంగాణ విద్యా రంగంలో ఒక ప్రత్యేక అధ్యాయానికి వేదికగా నిలిచింది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పునరుద్ధరణ, సమాజ మార్పులో విద్య పాత్రపై విస్తృతంగా మాట్లాడారు. విద్యార్థుల జీవితాల్లో అసలైన మార్పు సంక్షేమ పథకాల ద్వారా కాకుండా విద్య ద్వారానే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అవసరమే అయినప్పటికీ అవి కేవలం జీవనాధారాన్ని మాత్రమే కల్పిస్తాయని, కానీ కుటుంబాల భవిష్యత్తును మార్చే శక్తి విద్యకే ఉందన్నారు. ఒక కుటుంబం నుంచి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, అధికారులు తయారైతేనే ఆ కుటుంబంతో పాటు ఆ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు రంగుల భవనాల్లో లేదా ఆకర్షణీయమైన గోడల్లో లేదని, అది తరగతి గదుల్లో జరిగే బోధనలోనే ఉందని సీఎం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం చిన్నతనంగా భావించే ధోరణిని విడనాడాలని సూచించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ వంటి నాయకులు కూడా ప్రభుత్వ పాఠశాలల నుంచే ఎదిగి దేశ అత్యున్నత పదవులను అధిరోహించారని చెప్పారు. ప్రతిభకు పాఠశాల రకం అడ్డంకి కాదని, కృషి, క్రమశిక్షణ,

(మిగతా 2వ పేజీలో)



## ఉక్రెయిన్‌పైనే ఇక ట్రంప్ గురి

**ఇరాన్ వివాదం ముగిసిన అధ్యాయమని అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్య**

**రష్యాపై మరిన్ని ఆంక్షల విధింపునకు సంకేతాలు**

**ఉక్రెయిన్‌కు అండగా నిలవాలని జీ-7 దేశాల పిలుపు**

**జీ-7 వేదికగా మోదీకి ఆత్మీయ స్వాగతం పలికిన ట్రంప్**

**నౌకాయాన భద్రతపై ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాలన్న ప్రధాని**

**భద్రతామండలిలో భారత్‌కు స్లొవేకియా మద్దతు ప్రకటన**

ఎవియాన్-లే-బే: పశ్చిమాసియాలో నెలలుగా కొనసాగిన ఉద్రిక్త పరిస్థితులు ఇప్పుడు ముగింపు దశకు చేరుకున్నాయని, ఇకపై తన ప్రధాన దృష్టి ఉక్రెయిన్ యుద్ధంపైనే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం కనుగొనేందుకు తనవంతు ప్రయత్నాలన్నీ చేస్తానని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన జీ--7 దేశాల శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న ట్రంప్ ఈ మేరకు విలేకరులతో మాట్లాడారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలు ఇక గత విషయమని పేర్కొన్న ఆయన, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై

(మిగతా 2వ పేజీలో)




## హైదరాబాద్ డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం.. 12మంది విద్యార్థులపై కేసు

హైదరాబాద్
డెంటల్ కాలేజీలో జూనియర్లపై ర్యాగింగ్

12 మంది సీనియర్ విద్యార్థులపై కేసు నమోదు

ఆరుగురు విద్యార్థులను
ఆరు నెలల పాటు సస్పెండ్ చేసిన కాలేజీ

ర్యాగింగ్‌కు పాల్పడితే
కఠిన చర్యలు తప్పవని ప్రిన్సిపల్ హెచ్చరిక

హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రభుత్వ డెంటల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపింది. తమ జూనియర్ విద్యార్థులను వేధించారనే ఆరోపణలపై 12 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో నగరంలోని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ భూతం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రభుత్వ డెంటల్ కాలేజీ విద్యార్థులు ప్రస్తుతం బస చేస్తున్న ఉస్మానియా మెడికల్ కాలేజీ హాస్టల్ ప్రాంగణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మొదటి సంవత్సరం బీడీఎస్ విద్యార్థులను సీనియర్లు శారీరకంగా, మానసికంగా వేధించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంజీవ్ సింగ్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తాన్ బజార్ పోలీసులు 12 మంది విద్యార్థులపై తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కాలేజీ యాజమాన్యం తక్షణ క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. విచారణ పెండింగ్‌లో ఉండగానే, ఆరుగురు ఫైనల్ ఇయర్ విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేసింది. ఈ

## జన్యు వ్యాధితో పోరాడుతున్న బాలుడికి పవన్ అండ

**హనుమకొండలో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఏపీ ఉప ముఖ్యమంత్రి**

**నిరంజన్‌కు ధైర్యం చెప్పి వైద్య సహాయానికి హామీ**

**కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్న పవన్‌కల్యాణ్**

**వైద్య ఖర్చుల కోసం లక్ష రూపాయల సాయం అందజేత**

**జీవనోపాధి, ఇంటి నిర్మాణానికి సహకారం ప్రకటించిన డిప్యూటీ సీఎం**

**అభిమాన బాలుడితో మమేకమై ఆప్యాయత పంచుకున్న పవన్**

**కుటుంబానికి మరో 5 లక్షల సాయం ప్రకటించిన బండ్ల గణేశ్**



వరంగల్ : జన్యుపరమైన అరుదైన వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన ఓ బాలుడికి ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అండగా నిలిచారు. హనుమకొండలోని హనుమాన్‌నగర్‌కు వెళ్లి బాధిత బాలుడు నిరంజన్‌ను పరామర్శించిన ఆయన, ఆ కుటుంబానికి అన్ని విధాలుగా సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు. భగవంతుడి కృపతో నిరంజన్ పూర్తిగా కోలుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. బాలుడి పరిస్థితిని దగ్గరగా తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు వైద్య చికిత్సకు అవసరమైన సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. హనుమాన్‌నగర్‌కు చెందిన 17 ఏళ్ల నిరంజన్ జన్యుపరమైన వ్యాధితో చాలా కాలంగా బాధపడుతున్నాడు. వ్యాధి కారణంగా అతని శారీరక ఎదుగుదల ప్రభావితమై, రోజువారీ కార్యకలాపాలు కూడా నిర్వహించలేని స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పవన్‌కల్యాణ్ బుధవారం ప్రత్యేకంగా అతని నివాసానికి చేరుకుని బాలుడిని పరామర్శించారు. నిరంజన్ తల్లిదండ్రులు పొనుగోటి మానస, రామగోపాలచారిలతో మాట్లాడి బాలుడి ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలు తెలుసుకున్నారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఓపికగా విని వారికి మానసిక ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. బాలుడి వద్ద కూర్చొని ఆప్యాయంగా మాట్లాడిన పవన్‌కల్యాణ్ అతని నుదుటిపై ముద్దు పెట్టి ప్రేమాభిమానాలను చాటుకున్నారు. నిరంజన్‌తో కలిసి సెల్ఫీ దిగుతూ అతనిలో ఉత్సాహం నింపారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందజేసి త్వరగా కోలుకోవాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా తనకు ఒక కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పగా, వెంటనే స్పందించిన పవన్‌కల్యాణ్ 'కొని పంపిస్తా చిన్నా' అంటూ హామీ ఇచ్చారు. అయితే తాము అద్దె ఇంట్లో ఉంటున్నామని, కుక్కను పెంచుకోవడానికి ఇంటి యజమాని అనుమతిస్తాడో లేదో తెలియదని కుటుంబ సభ్యులు చెప్పగా, పవన్‌కల్యాణ్ స్వయంగా ఇంటి యజమానిని పిలిపించి మాట్లాడారు. బాలుడి కోరికను నెరవేర్చేందుకు సహకరించాలని కోరగా ఆయన కూడా అంగీకరించారు. దాదాపు 35 నిమిషాల పాటు ఆ ఇంట్లో గడిపిన ఉప ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. బాలుడి వైద్య చికిత్స కోసం తక్షణ సాయంగా రూ.1 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంతేకాకుండా నిరంజన్ తండ్రి జీవనోపాధి మెరుగుపడేందుకు క్యాంటీన్ ఏర్పాటు చేయించేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేరేలా ఇంటి నిర్మాణానికి కూడా తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని, కుటుంబాన్ని ఒంటరిగా వదిలిపెట్టబోనని భరోసా ఇచ్చారు. పవన్‌కల్యాణ్ రాకతో హనుమాన్‌నగర్ ప్రాంతంలో ప్రత్యేక వాతావరణం నెలకొంది. స్థానికులు, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఉప ముఖ్యమంత్రిని చూసేందుకు ఆసక్తి చూపారు. బాలుడితో ఆయన చూపిన ఆప్యాయత, కుటుంబానికి అందించిన భరోసా పలువురిని




## న్యాయమూర్తుల నియామకాలు.. తెరపైకి మళ్లీ స్థానికత అంశం

**హైకోర్టు జడ్జీల నియామకాల్లో స్థానికులకే అవకాశం ఇవ్వాలని డిమాండ్**

**హైకోర్టు వద్ద ధర్నా చేపట్టిన తెలంగాణ న్యాయవాదులు**

**స్థానికేతరుల పేర్లను పరిశీలించవద్దంటూ ఏకగ్రీవ తీర్మానం**

**ఏపీకి చెందిన న్యాయవాదుల పేర్లు పరిశీలనలో ఉన్నాయని ఆందోళన**

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో స్థానిక న్యాయవాదులకే ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ నిరసన చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం హైకోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. న్యాయమూర్తుల పోస్టుల కోసం స్థానికేతరుల పేర్లను పరిశీలించడాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. గత నెల 15న జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు న్యాయవాదులు వెల్లడించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, భవిష్యత్తులో చేపట్టే న్యాయమూర్తుల నియామకాలకు కేవలం తెలంగాణకు చెందిన వారి పేర్లనే సిఫార్సు చేయాలని సుప్రీంకోర్టు, హైకోర్టు కొలీజియంలను కోరారు. ఈ అంశంపై కేంద్ర న్యాయశాఖ మంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రి, గవర్నర్ వంటి రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారికి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. న్యాయమూర్తుల నియామకం కోసం పరిశీలిస్తున్న జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన న్యాయవాదుల పేర్లు ఉన్నాయనే సమాచారంతో ఈ నిరసన వెల్లువెత్తింది. సామాజిక న్యాయం పాటించాలన్నా, ప్రాంతీయ ప్రాతినిధ్యం కల్పించాలన్నా తెలంగాణ

# భ్రమరాంబిక ప్రాపర్టీస్ అధినేత బండారు మనుదీప్ కు గురు శిష్యుల చిత్రమాలిక అందించిన- సీనియర్ జర్నలిస్టు గణేష్ సాగర్





వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

ఎల్ బి నగర్ భ్రమరాంబిక ప్రాపర్టీ కార్యాలయంలో సంస్థ సీ.ఎండీ బండారు మనుదీప్ కు తన రియల్ ఎస్టేట్ "గురువు" నేచర్ నివాస్ డెవలపర్స్ సి.ఎండి సికిలమెట్ల శ్రీహరితో తన బర్త్డే సందర్భంగా దిగిన ఫోటోను సీనియర్ జర్నలిస్ట్, ప్రాపర్టీస్ అడ్వైజర్ గోల్లూరి గణేష్ సాగర్ అందించారు. బండారు మనుదీప్ వెంటనే ఆఫీస్ సిబ్బందితో తన గురువుతో దిగిన ఫోటోను తన క్యాబిన్ లో పెట్టారు ఈ సందర్భంగా మనుదీప్ మాట్లాడుతూ నేను విద్యార్థిగా ఉన్నప్పుడు తన సంస్థలో చేర్చుకొని రియల్ ఎస్టేట్ రంగంలో 12 సంవత్సరాల లో ఓనమాలు తీర్చిదిద్దారని తెలిపారు, నేను రియల్ ఎస్టేట్ రంగంలో నీతి, నిజాయితీతో ఈ స్థాయిలో ఉండడం భ్రమరాంబిక ప్రాపర్టీస్ స్థాపించడం శ్రీహరి సార్ కృషి అని అన్నారు. వారితో దిగిన ఫోటో నా ఆఫీసులో ఉండడం గర్వంగా ఉందని తెలిపారు

# జిల్లెలగూడ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన బిజెపి నేతలు

## --పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన శ్రీరాములు అందెల






వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : జూన్17 :-

మహేశ్వరం నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్, మీర్‌పేట్ డివిజన్‌లో ఉన్న జిల్లెలగూడ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు బుధవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం శ్రీ పథకం కింద చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 21 పాఠశాలలు ఎంపికయ్యాయని, వాటిలో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ఆరు పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. జిల్లెలగూడ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు రెండు సంవత్సరాల కాలానికి రూ.33 లక్షలకు పైగా నిధులు కేటాయించబడినట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, కరాటే శిక్షణ, క్రీడా సదుపాయాలు, సమ్మర్ క్యాంపులు, సీసీ కెమెరాలు తదితర ఆధునిక వసతులు కల్పించనున్నట్లు వివరించారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆరు రోజుల మెనూను రూపొందించిందని తెలిపారు. వారంలో మూడు రోజులు గుడ్డు, అరటిపండు అందించడంతో పాటు రెండు రోజులు ఆకుకూరలతో కూడిన ఆహారం అందించాలని పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్య, పోషకాహారం అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి అధ్యక్షులు తులసి ముకేశ్ ముదిరాజ్, పసునూరి బిక్షపతి చారి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,డివిజన్ పదాధికారులు, మాజీ కార్పొరేటర్లు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ కొన్నే సంపత్ గృహప్రవేశ వేడుకలకు హాజరైన మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 17 :

తెలంగాణ రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ కొన్నే సంపత్ నూతన గృహప్రవేశ మహోత్సవం బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి, బిజెపి నాయకులు బండ చంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొన్నే సంపత్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కొన్నే సంపత్ దంపతుల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని గృహ యజమానులను ఆశీర్వదించారు. అనంతరం కొన్నే సంపత్‌తో పాటు కుటుంబ సభ్యులను సన్మానించి, వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ రజక సంఘం బలోపేతానికి కృషి చేస్తున్న కొన్నే సంపత్ సేవలను ఈ సందర్భంగా పలువురు నాయకులు అభినందించారు. సమాజ అభ్యున్నతి కోసం ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొన్నే సత్యం, దినేష్, గట్టికొప్పుల లక్ష్మీనర్సయ్య, సీహెచ్ శ్రీనివాస్, నివాస్, మంజుల, వైశాలి, కొన్నే అర్చనతో పాటు బంధుమిత్రులు, రజక సంఘం నాయకులు, స్థానిక ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొన్నే సంపత్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## అన్ని పాఠశాలల్లో అల్పాహార పథకం అమలు చేయాలి:

### డిఈవోకు ఆర్యుపిపి వినతి...

### డిఈవో కు శ్రీశైలం మహాలడ్డు ప్రసాదం అందజేత

### శుభాకాంక్షలు తెలిపిన రికగ్నైజ్డ్ పండిత పరిషత్...



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 17

విద్యార్థుల ఆరోగ్యాభివృద్ధి, పాఠశాలల్లో నమోదు, హాజరు శాతాల పెంపు దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె. రాము కు రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్యుపిపి) జగిత్యాల జిల్లా శాఖ పక్షాన జిల్లా శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శులు వేల్పుల స్వామి యాదవ్, ఎనగందుల రాజేంద్రప్రసాద్ లు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్పాహార పథకం విద్యార్థుల పోషకాహార స్థాయిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తోందని, అయితే ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో ఈ పథకం అమలు కాకపోవడంతో ముఖ్యంగా పేద, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఈ ప్రయోజనాలను కోల్పోతున్నారని, అందువల్ల అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని సమర్థవంతంగా, నిరంతరంగా అమలు చేయాలని కోరారు. అదే విధంగా, ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో జగిత్యాల జిల్లా విద్యార్థులు అధిక సీట్లు సాధించి రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన మెటీరియల్ అందించడం, పర్యవేక్షణను బలోపేతం చేయడం ద్వారా ఈ ఫలితాలు సాధ్యమైనందుకు, నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన శుభసందర్భంగా జిల్లా విద్యాధికారికి శ్రీశైలం శ్రీ బ్రమరాంభ మల్లికార్జున స్వామి వారి మహా లడ్డూ ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవానికి ఎస్ఐ. జగన్ కి ఆహ్వానం

వార్త మిర్రర్ సంస్థాన్ నారాయణపురం ప్రతినిధి : జూన్17 :- యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పెద్దిరాజు పెద్దమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నారు. కళ్యాణ మహోత్సవానికి సంస్థాన్ నారాయణపురం ఎస్ఐ జె. జగన్ కి ఆహ్వాన పత్రం అందజేసారు ముదిరాజ్ సంఘం అధ్యక్షులు ఉప్పరగొని యాదయ్య,మాజీ అధ్యక్షులు నిమ్మల నాగేష్ ముదిరాజ్.ఈ కార్యక్రమంలో పెద్దమ్మ గుడి చైర్మన్ గట్టు గోపాల్,మాజీ ఉపాధ్యక్షులు ఉప్పరగోని యాదయ్య,పులమోని వెంకటేష్,ఉప్పరగొని రమేష్, చింతల సత్తయ్య,ముదిరాజ్ సంఘం నాయకులు,తదితరులు, పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఎంటర్ప్రైజెస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దేప భాస్కర్ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : జూన్17 :-

రంగారెడ్డి జిల్లా ఎల్ బి నగర్ నియోజకవర్గం నాగోల్ స్నేహపురి కాలనీలో నరేందర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఎంటర్ప్రైజెస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రారంభించిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి వారి వెంట రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పందుల వెంకటేష్ గౌడ్ ,శ్రీనివాస్ వాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆదర్శ పాఠశాల,కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

### ప్రిన్సిపాల్ శివ స్వరూపా రాణి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 17

చౌటుప్పల్ మండల కేంద్రంలోని లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2026 -27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ,ఏసీఈ గ్రూపులలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ప్రిన్సిపాల్ శివ స్వరూప రాణి పత్రికకు ఇచ్చిన ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అర్హులైన స్థానిక విద్యార్థులు ఈనెల 22 లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు ఇట్టి సదావకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.






# ఓటరు జాబితా ప్రక్షాళనలో రాజకీయ పార్టీల సహకారం కీలకం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 17: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అభ్యంతరాల పరిష్కారం, మార్పులు చేర్పుల విధానంపై అధికారులు నేతలకు వివరించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీల సహకారం అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సమావేశంలో భారత రాష్ట్ర సమితి తరఫున రాజేందర్, రాజా సుందరం, జింకల మల్లేష్, వరికుప్పల శ్యామ్, రాజేష్, అశ్విన్, సునీల్ పాల్గొన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు.




# ఆదర్శ పాఠశాల,కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

## ప్రిన్సిపాల్ శివ స్వరూపా రాణి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 17

చౌటుప్పల్ మండల కేంద్రంలోని లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2026 -27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ,ఏసీఈ గ్రూపులలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బుధవారం ప్రిన్సిపాల్ శివ స్వరూప రాణి పత్రికకు ఇచ్చిన ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అర్హులైన స్థానిక విద్యార్థులు ఈనెల 22 లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు ఇట్టి సదావకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

# మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా ఎమ్మెల్యే మర్రి జన్మదిన వేడుకలు

వార్త మిర్రర్, మల్కాజిగిరి :మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు జేపీసీ వెంకన్న ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.అనంతరం బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనహృదయనేత, మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత నిరంతర శ్రామికుడు, పరిపాలన సమర్థుడు ఆధునికతకు పట్టంకట్టే నాయకుడు తన విలువలు విజయంతో ప్రజా సమస్యల పరిష్కారం తో పాటు సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని మల్కాజిగిరి నియోజకవర్గం సమగ్రాభి వృద్దే లక్ష్యంగా పనిచేస్తు ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండే నాయకుడు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి , మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సునీత రాము యాదవ్, మురుగేష్,చిన్న యాదవ్, నర్సింగ్, ఉపేందర్, నీలం సతీష్, , కాటంరాజు, బాబు పటేల్, సిద్ది రాములు, రాము యాదవ్,గంగాధర్ కృష్ణ, సైదులు, గణేష్, నరహరి, కరీం,రమేష్, భాగ్యనంద్, బిక్షపతి,, సతీష్, సిక్క ప్రభాకర్,శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, రాములు, రామకృష్ణ, ,నవీన్, కుమార్, కిరణ్, కొటేష్, అనిల్, వెంకటేష్, శ్రీకాంత్, చంద్రమౌళి, ఫరీద్, నర్సింగ్ రావు,లక్ష్మణ్, శ్రీధర్, శారద, అనిల్, సంతోష్ గుప్తా, తులసి సురేష్, మల్లేష్ యాదవ్, కిట్టు, రామచందర్, పిఎస్ శ్రీనివాస్, నర్సింగ్ రావు,శ్రీనివాస్,శ్రీకాంత్ యాదవ్, జంగా రాజు,



బాబన్న, వెంకటేష్, వేణు యాదవ్, సురేష్,నరేష్, బాలకృష్ణ,ఉమేష్,వాసు, పాషా, శివ గౌడ్, మల్లేష్, సుమన్,వినీత్, జోగు శ్రీనివాస్, శంకర్, కృష్ణ,ప్రభాకర్,మరియు భారీ ఎత్తున బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతులుగా ఎదగాలి-- డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా అనాధ పాఠశాల విద్యార్థులకు కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహార వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా సంస్థ అధినేత డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా ప్రవర్తన. నడవడిక. సమాజం పట్ల బాధ్యత. తల్లిదండ్రుల పట్ల గౌరవం. విద్య బోధించే ఉపాధ్యాయుల పైన గౌరవం,తోటి విద్యార్థుల పట్ల స్నేహం సహాయ సహకారాల వంటి గుణాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు



తెలిపారు. విద్యార్థులు బాధ్యతగా చదివితేనే ఉజ్వల భవిష్యత్తు కనిపిస్తుంది అన్నారు. విద్యార్థి జీవితం ఇక్కడే ప్రారంభం అవుతుందని మంచి చెడు ద్వారాలు కనిపిస్తాయని ఏ దారిలో వెళ్లాలో విద్యార్థులే నిర్ణయించుకోవాలని అన్నారు. మీ తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని మరవద్దన్నారు. బాధ్యత గల విద్యార్థిగా చదువును గురువులను తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు

# సర్పంచ్ ర్యాకల సంతోష -శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమికొన్నత పాఠశాల లో పునః ప్రారంభ వేడుకలు

### నూతనంగా మంజూరైన ఆర్ ఓ ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ప్రారంభించిన- సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధిపాఠశాలలు పునః ప్రారంభం అయిన సందర్భంగా తాజ్ పూర్ పాఠశాల లో సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ మరియు పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభ వేడుకలు నిర్వహించడం జరిగింది.తదుపరి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి నూతనంగా మంజూరైన ఆర్ ఓ ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ను ప్రారంభించడం జరిగింది..ఈ సందర్బంగా పాల్గొన్న సర్పంచ్ గారు ప్రార్ధన, ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది..ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో పునరుద్దరించామని ప్రత్యేక డిజిటల్ క్లాసులు, తదితర అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకున్న నాణ్యమైన విద్యను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించడం జరిగింది...ఈ కార్యక్రమం లో సామజిక వేత్త డా, ర్యాకల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబీ యాకుబ్, బొమ్మారపు రామక్రిష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజ్, బీట్కూరి మహేష్, వరిగంటి మానస నాగరాజు, స్థానిక వార్డు సభ్యులు షేక్ ఏ ఏ పి సి చైర్మన్



వరిగంటి రమ్య,అంగన్వాడీ టీచర్ ఊర్మిళ,ఉపాధ్యాయ బృందం,విద్యార్థుల తల్లి దండ్రులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగం ఎంతో అవసరం

### వనస్థలిపురంలో జేవిఆర్ ఇవి మొబిలిటీ వాహన షో రూమ్ ని ప్రారంభించిన హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్

ఎల్బీనగర్, 17 జూన్: కాలుష్య నియంత్రణ కోసం ఎలక్ట్రానిక్ వాహనాల ఉపయోగం ఎంతో శ్రేయస్కారమని హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ అన్నారు. వనస్థలిపురం సుష్మా చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన జెవిఆర్ ఇవి మొబిలిటీ వాహనాల షోరూంను హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై తెలంగాణ డిస్ట్రిబ్యూటర్ జె.వి.ఆర్ తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సమావేశంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరు ఇవి వాహనాలను వినియోగించి కాలుష్య రహిత సమాజానికి తోడ్పడాలని పేర్కొన్నారు. వాహనాదారులలో కూడా చాలా మార్పులు రావడం అభినందనీయం అన్నారు. దాదాపు 30 శాతం మంది ఎలక్ట్రానిక్ వాహనాలను ఉపయోగించడానికి ముందుకు రావడం శుభ పరిణామమని రంగనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. జె.వి.ఆర్ ఇవి మొబిలిటీ యజమాని జల్లేపల్లి వెంకటేశ్వరరావు (జె వి ఆర్) మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో కూడిన ఇవి వాహనాలను వినియోగదారులకు అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని గుర్తు చేశారు.ప్రస్తుతం 4,5 రకాల ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు తమ షోరూమ్ లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సంగం శెట్టి ప్రసాద్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో హయత్నగర్ మాజీ ఎంపీపీ ధనరాజ్ గౌడ్ హైరా



రియాల్టీ చైర్మన్ పోశం నర్సిరెడ్డి, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దేవయ్య పటేల్, రజినీకాంత్ సంగాని, ఇవి మొబిలిటీ ఏరియా సేల్స్ మేనేజర్ జి. నరసింహ, చంద్రశేఖర్, మహేందర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురం ఫేస్ -1 కాలనీ ఆలయ ప్రాంగణం పార్క్, ప్రజా గ్రంథాలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

ఎల్బీనగర్ 17 జూన్: వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ఫేస్ -1 ప్రాచీన శివాలయ ప్రాంగణం పరిధిలోని పార్కు, ప్రజా గ్రంథాలయ అభివృద్ధికి బుధవారం శ్రీకారం చుట్టారు. గత కొన్ని నెలలుగా కాలనీ వాసులు ఎదురు చూస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు మన కాలనీ -- మన గుడి -- మన పార్క్ -- మన గ్రంథాలయం” అనే లక్ష్యంతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు.వనస్థలిపురం ఫేస్-1 నివాసితుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు మరియు కాలనీ వాసుల అభ్యర్థన మేరకు మున్సిపల్ అధికారులు సానుకూలంగా స్పందించి పార్కు, గ్రంథాలయం మరియు పరిసర ప్రాంతాల అభివృద్ధి పనులను చేపట్టారు.స్వచ్ఛత -- శుభ్రత కార్యక్రమంలో భాగంగా కాలనీ కమిటీ సభ్యులు మరియు స్థానిక నివాసితులు స్వచ్ఛందంగా పాల్గొని గ్రంథాలయ భవనం, టాయిలెట్లను శుభ్రపరిచారు. పాడైపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పునరుద్ధరణ పనులు చేపట్టారు. భవనాలకు సున్నం, రంగులు వేసి గ్రంథాలయానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు ప్రారంభించారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం, శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలను కూడా చురుకుగా కొనసాగుతున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి సంస్థానం (రిజి. నెం. 73/2024), వనస్థలిపురం ఫేస్-1 నివాసితుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు మరియు కాలనీ వాసుల సహకారంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.ఈ కార్యక్రమంలో శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి సంస్థానం (దేవాలయ కమిటీ) మరియు వనస్థలిపురం ఫేస్-1 నివాసితుల సంక్షేమ సంఘం చైర్మన్ మల్లావజ్జుల వేంకట మణిశేఖర్, కమిటీ సభ్యులు గాండ్ల అంజయ్య, ఉప్పు వెంకటేష్, రాపోలు పురుషోత్తం, నరేంద్ర కుమార్,



జి. సత్యమూర్తి, గాండ్ల సేనయ్య, జి. మహేష్, ఎం. శ్రీనివాసరావు, ఎస్. దిలీప్ రాజన్, సౌజన్య రాజన్, మోహన వంశీ తో పాటు కాలనీ వాసులు కవిత,మహిపాల్ రెడ్డి, సతీష్,అనంతయ్య, ముఖేష్, షక్రేజార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి, పార్కు పరిరక్షణ, గ్రంథాలయ పునరుద్ధరణ మరియు దేవాలయ అభివృద్ధికి స్థానిక ప్రజల సహకారం నిరంతరం కొనసాగాలని కోరారు.



# శ్రీ.శ్రీ.శ్రీ దుర్గాభవాని సమేత శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి : జూన్17 :-

మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్, ప్రశాంతి హిల్స్ 58వ డివిజన్, రోడ్ నెం.2, మీర్‌పేట్ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీశ్రీశ్రీ దుర్గాభవాని సమేత శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవతామూర్తుల దివ్య కటాక్షం, ఆశీస్సులు ఎల్లప్పుడూ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అర్కల భూపాల్ రెడ్డి, అనిల్ యాదవ్, సిద్దాల చిన్న బీరప్ప, మాజీ అధ్యక్షులు కామేష్ రెడ్డి, మదారి రమేష్, విజయ్, శీను నాయక్, గోపి యాదవ్, ప్రవీణ్ రెడ్డి, నర్సిరెడ్డి, మాజీ మహిళా అధ్యక్షురాలు సునీత బాలరాజ్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కృపేష్, నిర్మలారెడ్డి, బిందు తదితరులు పాల్గొన్నారు.



# కోనేటిపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ కు ఘన వీడ్కోలు

వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

కోనేటిపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్ వేరే గ్రామపంచాయతీ కి బదిలీ కావడం జరిగింది ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలతో అంబేద్కర్ యూత్ సభ్యుల తరుపున చిరు వీడ్కోలు సన్మానం చేయడం జరిగింది. అంబేద్కర్ యూత్ సభ్యుడు కె విజయ్ మాట్లాడుతూ మహేష్ సార్ పంచాయతీ కార్యదర్శి గా ఉన్నన్ని రోజులు కొనేటిపురం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారు అలానే అందరికి అందుబాటులో ఉంటూ గ్రామ ప్రజల కి ఏమైనా సలహాలు అడిగితే తనకు తోచిన విధంగా వివరించేవారు. తన పదవీకాలంలో కోనేటిపురం గ్రామ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ,వార్డు సభ్యులు దొడ్డి అశ్విని,విజయ్ ,శ్రీనుపవన్, అనిల్ ,బన్నీ, చందు, వినయ్, వంశీ. తదితరులు పాల్గొనడం జరిగింది

# స్కిల్ హబ్‌గా కల్వకుర్తి

### - టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి




కల్వకుర్తి, జూన్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఏఐ, ఐటీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం కోసం అమెరికాకు చెందిన ఇన్ఫోడాట్ గ్లోబల్ ఇంక్ సంస్థతో భాగస్వామ్యం కుదిరిందన్నారు.రాబోయే ఐదు సంవత్సరాల్లో 5 వేల మంది యువతకు కృత్రిమ మేధస్సు, సమాచార సాంకేతికత, డేటా అనలిటిక్స్, డిజిటల్ టెక్నాలజీలలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. కల్వకుర్తిని భవిష్యత్తులో నైపుణ్యాలు, సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్ఫోడాట్ గ్లోబల్ ఇంక్ వ్యవస్థాపకుడు ఎం. మల్లారెడ్డి, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పూడికతీత పనులను వెంటనే పూర్తి చేయాలి పూడికతీత పనులను పరిశీలించిన బిజెపి పార్టీ నాయకులు



నాచారం, జూన్ 17 వార్త మిర్రర్ :

నాచారం డివిజన్ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు నవీన్ కుమార్ అధ్యక్షతన నాచారం పరిధి లోని నాలాలను సందర్శించి పరిశీలించడం జరిగింది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నాలాల్లో పూడికతీత పనులను వెంటనే పూర్తి చేయాలని, అలాగే దెబ్బతిన్న ఫెన్సింగ్‌ను మరమ్మతు చేసి ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ నాచారం నాలాలకు 2300 మీటర్ల మేర డీసిల్టింగ్ పనులకు అనుమతులు మంజూరైనా, కేవలం 1000 మీటర్ల వరకు మాత్రమే పనులు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కూలి పోయిన రిటైనింగ్ వాల్స్, ఫెన్సింగ్ తొందరగా నిర్మాణం చేయాలనీ డిమాండ్ చేయడం జరిగింది. మిగిలిన పనులు పూర్తికాకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మిగిలిన పూడికతీత పనులను వెంటనే పూర్తి చేయాలని, నాలాల వెంట ఉన్న ఫెన్సింగ్‌ను పటిష్టంగా ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి, మల్క ప్రకాష్, అనిత పద్మారెడ్డి, అభిషేక్ గౌడ్, రవికాంత్, ఉదయ్ కిరణ్ రెడ్డి, దయా గౌడ్, వెంకటేష్ గౌడ్, ఆనంద్ గుప్తా, సాయి గౌడ్, వరలక్ష్మి, బాలు, కృష్ణ గౌడ్, శేఖర్, సురేందర్, వెంకటేశ్వర్లు, కౌశిక్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఎవరా గూఢచారి?



కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'డెవిల్'. 'ది బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ఉపశీర్షిక. స్వీయ దర్శకనిర్మాణంలో అభిషేక్ నామా తెరకెక్కిస్తున్నారు. పీరియాడిక్ స్పై థ్రిల్లర్ కథాంశమిది. సంయుక్తా మీనన్ కథానాయిక. ఈ చిత్రాన్ని ఈ నెల 29న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఎవరికీ అంతు పట్టని ఓ రహస్యాన్ని ఛేదించే బ్రిటీష్ ఏజెంట్‌గా కల్యాణ్‌రామ్ పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. భారీ యాక్షన్‌తో పాటు థ్రిల్లింగ్ అంశాలతో సాగుతుంది. కల్యాణ్‌రామ్ భిన్న గెటప్స్‌లో కనిపిస్తారు. ఆయన లుక్స్‌కు మంచి స్పందన లభిస్తున్నది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్నాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సౌందర్‌రాజన్, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: శ్రీకాంత్ విస్సా, నిర్మాత, దర్శకత్వం: అభిషేక్ నామా.

# విద్యార్థిగా సూర్య



తమిళ అగ్ర హీరో సూర్య ప్రయోగాలకు పెట్టింది పేరు. కమర్షియల్ సినిమాలతో పాటు సామాజిక ఇతివృత్తాలను ఎంచుకొని సినిమాలు చేస్తుంటారు. ఆకాశం నీ హద్దురా, జై భీమ్ వంటి చిత్రాలు స్ఫూర్తివంతమైన కథాంశాలతో ప్రేక్షకాదరణ పొందాయి. ప్రస్తుతం సూర్య పీరియాడిక్ చిత్రం 'కంగువ'లో నటిస్తున్నారు. వచ్చే వేసవిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో సుధా కొంగర దర్శకత్వంలో తన తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నారు సూర్య. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో 'ఆకాశం నీ హద్దురా' వంటి సూపర్‌హిట్ చిత్రమొచ్చిన విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం 1965లో తమిళనాడులో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. హిందీ భాషకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రాజేంద్రన్ అనే వ్యక్తి జీవిత కథ ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిసింది. ఈ సినిమాలో సూర్య విద్యార్థి నాయకుడిగా

# ఆ డైలాగ్‌తో పడిపోయా!

ఈ ఏడాది ఫిబ్రవరిలో బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహమాడింది అగ్ర కథానాయిక కియారా అద్వాణీ. 'షేర్షా' చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించారు. అక్కడే ఈ జంట మధ్య ప్రేమ చిగురించింది. అనంతరం వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ నేపథ్యంలో ఇటీవల 'కాఫీ విత్ కరణ్' షోలో పాల్గొన్న కియారా అద్వాణీ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. భర్త సిద్ధార్థ్ మల్హోత్రా తనకు లవ్ ప్రపోజ్ చేసిన క్షణాలను గుర్తుచేసుకుంది. ఆమె మాట్లాడుతూ 'సిద్ధార్థ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓసారి రోమ్ టూర్‌కు వెళ్లాను. అక్కడ ఓ రోజు క్యాండిల్ లైట్ డిన్నర్ చేసిన తర్వాత రోమ్ వీధుల్లో సరదాగా నడుచుకుంటూ వెళ్తున్నాం. అప్పుడు ఓ వ్యక్తి మా దగ్గరకు వచ్చి వయోలిన్ ప్లే చేస్తూ పాట వినిపించాడు. వెంటనే సిద్ధార్థ్ మోకాళ్లపై కూర్చొని 'షేర్షా' సినిమాలోని 'ఢిల్లీ కా సీదా సాదా లుండా హూ' (ఢిల్లీకి చెందిన ఓ సాధారణ అబ్బాయిని) అనే డైలాగ్ చెప్పి లవ్ ప్రపోజ్ చేశాడు. ఏదో తెలియని ఆనందంలో వెంటనే ప్రేమకు అంగీకారం తెలియజేశా. మా స్నేహితుడొకరు ఈ సంఘటనను వీడియో తీశారు. నా జీవితంలో చిరకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకమది' అంటూ ఆనందం వ్యక్తం చేసింది.

# కేరళలో గుంటూరుకారం



మహేష్‌బాబు కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'గుంటూరు కారం' చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఈ సినిమా ఫస్ట్‌గ్లింప్స్‌తో పాటు ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ సింగిల్ 'ధమ్ మసాలా' సంగీత ప్రియులను ఆకట్టుకుంది. దీంతో రెండో గీతంపై ఆసక్తినెలకొంది. ఈ పాటను సోమవారం విడుదల చేయబోతున్నట్లు చిత్ర నిర్మాత నాగవంశీ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా తెలిపారు. ఇదిలా వుండగా ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. ప్రస్తుతం కేరళలోని సుందరమైన లొకేషన్లలో ఓ రొమాంటిక్ గీతాన్ని తెరకెక్కిస్తున్నారని తెలిసింది. ఈ షెడ్యూల్ అనంతరం చిత్రబృందం హైదరాబాద్‌లో మరో కీలక షెడ్యూల్‌కు ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ప్రకాష్‌రాజ్, బ్రహ్మానందం, జగపతిబాబు, జయరాం తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది.